క్లుప్తంగా

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ



ఆగిరిపల్లి: ఆగిరిపల్లి కొండ కాలనీ వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ వెట్రిసెల్వి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని రుచిగా పిల్లలకు అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. పిల్లల ఆరోగ్య విషయంలో అయాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వండిన పదార్థాలపై మూతలు పెట్టాలని, పరిశుభ్రత పాటించాలని, తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. చిన్నారులకు నేర్పించే విద్యా బోధనలు, గేయాలను కలెక్టర్ ఆలకించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ రికార్డులను పరిశీలించారు. కలెక్టర్ వెంట నూజివీడు ఆర్డీఓ భవానీ శంకరి, తహసీల్దార్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిత్యావసరాలు అందజేత



ఇబ్రహీంపట్నం: కృష్ణానది వరద ముంపునకు గురై తీవ్రంగా నష్టపోయిన పెదలంక గ్రామానికి చెందిన 200 మందికి ఎన్టీటీపీఎస్ ఏపీఎస్ ఈబీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రూ.2 లక్షల విలువైన నిత్యావసర వస్తువులు గురువారం పంపిణీ చేశారు. ఎంపీపీ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీలు, టేబుల్స్, నోట్ బుక్స్, స్నాక్స్ అందజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఏవీ కిరణ్, ఎస్ఈలు వెంకటరావు, పి.ప్రసాద్, కేంద్ర కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

● జూపూడిలో వరద బాధితులు 30 మందికి సర్వీస్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ మల్లెల అనిల్ కుమార్ రూ.4 వేలు చొప్పున అందజేశారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం



పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలను రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో బాబా విగ్రహ ప్రతిష్ఠ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులచే 54 కిలోల పంచదారతో షిర్డీ సాయిబాబాకు అభిషేకం జరిపారు. బాబా చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉంచి ఊరేగించారు. షిర్డీ సాయిబాబా సేవా సమితి సభ్యులు, తిరువూరు సత్యసాయిబాబా సేవా కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



ముసునూరు: వేల్పుచర్లలో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు ప్రభ ఆస్పత్రికి చెందిన ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ సునీల్ సందీప్, డాక్టర్ ఫిరోజ్ బృందం 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 20 మందికి మెరుగైన వైద్య సేవల కోసం రిఫర్ చేశారు. సర్పంచ్, ఉప సర్పంచ్ పుట్ల మోహనరావు, పటాపంచల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'ఒకే దేశం, ఒకే ఎన్నికలు' ఆమోదం పొందదు

నూజివీడు: 'ఒకే దేశం, ఒకే ఎన్నికలు'పై మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ నివేదికకు మంత్రివర్గం ఆమోదం తెలిపినా లోక్‌సభ, రాజ్యసభల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ లేనందున ఆమోదం పొందదని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. హరినాథ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇండియా కూటమి, ప్రాంతీయ పార్టీలు దీనిని సమైక్యంగా తిరస్కరించాలని కోరారు. రాజ్యాంగం భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా ప్రకటించగా, ఇక్కడ ప్రతి రాష్ట్రం వారి హక్కులతో మొత్తం ఐక్యతతో కట్టుబడి ఉందన్నారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వ నినాదాన్ని పునరావృతం చేస్తూ దేశంలోని అన్ని స్థాయిలలో అధికారంలో ఉన్న పార్టీనే అధికారంలో ఉండాలని కేంద్ర ప్రభుత్వం స్పష్టంగా చెబుతోందని, ఈ మార్పు ఖచ్చితంగా భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని రాష్ట్రపతి వ్యవస్థగా మారుస్తుందన్నారు. దీనిని అన్ని పార్టీలు వ్యతిరేకించాలని విజ్ఞప్తి చేశారు.



ఇబ్రహీంపట్నంలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో అమ్మవారు



తోటమూలలో ఏర్పాటుచేసిన అమ్మవారి ప్రతిమ



గంపలగూడెం గాంధీ సెంటర్‌లో అమ్మవారి అలంకరణ



తిరువూరు కనకదుర్గాలయంలో అమ్మవారి అలంకారం



నూజివీడు దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు



తిరువూరు అష్టలక్ష్మీ ఆలయంలో ఆదిలక్ష్మి అలంకారం

త్రిపుర సుందరీదేవీ నమోస్తుతే..

ఇబ్రహీంపట్నం: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పలు ఆలయాలు, చలువ పందిళ్లలో తొలి రోజు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొండపల్లి శ్రీమద్విరాట్ విశ్వకర్మ దేవాలయంలో కామాక్షి అమ్మవారు బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కిలేశపురం, ఇబ్రహీంపట్నం గంగానమ్మ ఆలయంలో భక్తులు పూజలు చేశారు. చలువ పందిళ్లలో ఏర్పాటు చేసిన దుర్గమ్మ విగ్రహాలను అలంకరించి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

● గంపలగూడెం: గంపలగూడెం గాంధీ సెంటర్, కాపుల వీధి, షిర్డీ సాయిబాబా ధ్యాన నిలయం, భజన మందిరం, ముత్యాలమ్మ గుడి వద్ద అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పెనుగొలను రామలింగేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ దేవికి, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో గజలక్ష్మీదేవికి, ఊటుకూరు రామాలయంలో రాజ్యలక్ష్మీదేవికి, కొణిజెర్ల కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి, తోటమూల వై-జంక్షన్ ప్రత్యేక పందిరిలో నెలకొల్పిన దుర్గమ్మతల్లికి బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో దుర్గమ్మ భక్త బృందం ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు.

● నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలాచార్యులు అర్చక బృందంచే వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం రాజ్యలక్ష్మీ దేవిని ఆదిలక్ష్మీదేవిగా అలంకరించి శక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.



కొండపల్లి మద్విరాట్ విశ్వకర్మ ఆలయంలో అమ్మవారికి పూజలు



చనుబండలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



మైలవరం విజయవాడ రోడ్డులో బాల త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు



కొణిజెర్లలో బాలాత్రిపుర సుందరీదేవి అలంకరణలో కనకదుర్గమ్మ



తిరువూరు అష్టలక్ష్మీ ఆలయంలో ఆదిలక్ష్మి అలంకారం



జి. కొత్తూరులో పూజలు



చౌటపల్లిలో అమ్మవారికి పూజలు

గంపలగూడెం గాంధీసెంటర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో సహస్ర కుంకుమార్చన నిర్వహించారు.

● తిరువూరు: తిరువూరు శ్రీ గౌరీ కేదారేశ్వరాలయం, శ్రీ అష్టలక్ష్మీ ఆలయం, శ్రీ రామలింగేశ్వరాలయం, శ్రీ చంద్రమౌళీశ్వరాలయం, సంతోషిమాత ఆలయం, ఆర్యవైశ్య కల్యాణ మండపం, శ్రీరంగ నాయకస్వామి ఆలయం, కనకదుర్గాలయాల్లో అమ్మవారిని విభిన్న రూపాల్లో అలంకరించి విశేష పూజలు చేశారు.

●హనుమాన్ జంక్షన్ రోడ్డులోని జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో సరస్వతీదేవి, బస్టాండు వద్ద ఉన్న దుర్గామల్లేశ్వరస్వామి(శివాలయం) ఆలయంలో అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

● చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో దేవీ నవరాత్రి పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లలో అమ్మవారు మొదటి రోజున బాలా త్రిపుర సుందరీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు.

● మైలవరం: స్థానిక విజయవాడ రోడ్డులోని కేడీసీసీ బ్యాంకు వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిరిలో అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. దసరా సంబరాల్లో భాగంగా అమ్మ వారి చలువ పందిళ్లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

● ఎ.కొండూరు: కొత్తరేపూడి, కంభంపాడు, ఎ.కొండూరు, చీమలపాడు, కృష్ణారావుపాలెంతో పాటు పలు గ్రామాల్లోని ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి పూజలు చేశారు. ఆయా గ్రామాల ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బలివే (ముసునూరు): బలివేలోని రామలింగేశ్వస్వామి ఆలయానికి, ఉప ఆలయంలో కొలువై ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. చింతలవల్లి, చెక్కపల్లి, గుడిపాడు శివాలయాలు, ముసునూరు తూర్పు,పడమటి రామాలయాల్లో, చెక్కపల్లి, లోపూడి, రమణక్కపేట శ్రీ కోదండ రామాలయాలలో, అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించారు.

● తిరువూరురూరల్: మండలంలోని పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. జీకొత్తూరు, చౌటపల్లి, అక్కపాలెం గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి చౌటపల్లిలో అమ్మవారికి పూజాదికాలు జరిపారు.

● విస్సన్నపేట: ద్వారకానగర్‌లోని కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

కోటమహిషాసురమర్దిని ఆలయంలో..

నూజివీడు: దసరా ఉత్సవాలకు ఆంధ్రా మైసూర్‌గా పేరుగాంచిన నూజివీడులో 68వ శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలోని శ్రీ కోట మహిషాసురమర్దిని అమ్మవారి ఆలయంలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మొదటి రోజున అమ్మవారు శ్రీ బాలాత్రిపురసుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అలివేణి ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధాన అర్చకులు జి. సత్యనారాయణాచార్యులు తొలుత కలశస్థాపన, అఖండ దీపారాధన, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది.

దశావతారాలతో అలరించిన విద్యార్థులు



దశావతారాల వేషధారణలో మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాల విద్యార్థినులు



నూజివీడు త్రివిధ హైస్కూల్లో దుర్గాదేవి వేషధారణలో విద్యార్థినులు

మైలవరం: దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి భారతీయుడు గౌరవించాలని శ్రీ లీలావతి గిరిజన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ అన్నారు. మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాలలో దసరా ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు దశావతారాల వేషధారణలతో అలరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● నూజివీడు: పట్టణంలోని త్రివిధ హైస్కూల్‌లో దసరా వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు అమ్మవార్ల వేషధారణతో ఆకట్టుకున్నారు. మహిషాసుర మర్దిని ఘట్టాన్ని ప్రదర్శించారు. చిన్నారులు విచిత్ర వేషధారణలతో అలరించారు. పండుగ విశేషాలతో కూడిన వివిధ ప్రదర్శనలను నిర్వహించారు.

కాంట్రాక్టు అధ్యాపకుల నిరసన



ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు

నూజివీడు: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లోని కాంట్రాక్టు అధ్యాపకులకు వేతనాలను పెంచుతూ ఇచ్చిన జీఓ నంబరు 110ని అమలు చేయడంలో కృష్ణా విశ్వవిద్యాలయం అధికారులు తాత్సారం చేస్తూ తీరని అన్యాయం చేస్తున్నారని కాంట్రాక్టు అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని కృష్ణా యూనివర్సిటీ ఎమ్మార్ అప్పారావు కాలేజీ ఆఫ్ పీజీ స్టడీస్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులు కృష్ణా విశ్వవిద్యాలయం ఉన్నతాధికారుల తీరుకు నిరసనగా గురువారం పీజీ సెంటర్ వద్ద ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు జీఓ నంబరు 110ని అమలు చేయగా.. కృష్ణా విశ్వవిద్యాలయం ఇప్పటికి కూడా అమలు చేయలేదన్నారు.

మూడు నెలల కిందట జీఓను కొంతమందికి మాత్రమే అమలు చేసి వివక్షత చూపడమేమిటని ప్రశ్నించారు. కొంతమందికి పెంచిన జీతాలను రెండు నెలలుగా తగ్గించి వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. కాంట్రాక్టు అధ్యాపకులు వర్ధన్, సి. నాగేశ్వరరావు, షేక్ అన్వర్ బాషా, కె. ప్రభాకర్‌రావు, యూ. బిందుమాధవి, కేపీ శివపార్వతి, టి. నాగరాజు, ప్రసాద్, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతలకు పరామర్శ



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి హరిబాబును పరామర్శిస్తున్న ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ నాయకులను మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు గురువారం పరామర్శించారు. అనారోగ్యంతో విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి తిరిగి వచ్చిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, నూగొండపల్లి మాజీ ఎంపీటీసీ మచ్చా సంధ్యారాణిని ప్రతాప్ అప్పారావు పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీటీసీ గుర్రం శ్రీనివాసరావు, సర్పంచులు కందుల విక్రమ్, కూరాకుల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు. మండలంలోని తోటపల్లికి చెందిన వైఎస్సార్ సీపీ మండల సీనియర్ నాయకుడు బెజవాడ రాంబాబు తండ్రి సీమయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. బెజవాడ రాంబాబును, ఆయన కుమారుడు వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు బెజవాడ శ్రీహర్షను ప్రతాప్ అప్పారావు పరామర్శించారు. ఆయన తండ్రి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జెడ్పీటీసీ వీరబాబు, వైఎస్సార్ సీపీ మాజీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు శివ, నాగబాబు, నాయకులు పాల్గొన్నారు.

5, 6 తేదీల్లో బస్‌పాసుల జారీ నిలిపివేత

తిరువూరు: ఆర్టీసీ వెబ్‌సైట్ నిర్వహణ నిమిత్తం ఈ నెల 5, 6 తేదీల్లో బస్‌పాసుల జారీని నిలిపివేస్తామని తిరువూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వేణు తెలిపారు. విద్యార్థుల బస్‌పాసులను తిరువూరు, మైలవరం బస్‌స్టేషన్లలో ఈ రెండు తేదీల్లో జారీ చేసే అవకాశం లేనందున తదుపరి తేదీల్లో పొందవచ్చని ఆయన సూచించారు.

ప్రజా సమస్యలపై పోరాటం: ఎంసీపీఐ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాలని ఎంసీపీఐ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్ణయించింది. సమావేశం గురువారం స్థానిక ఎంసీపీఐ కార్యాలయంలో జరిగింది. ఎంసీపీఐ పట్టణ కార్యదర్శి కలకోటి బసవయ్య మాట్లాడుతూ మున్సిపాల్టీ ఎన్నికలు జరిగి మూడేళ్లు కావస్తున్నా పాలకవర్గం ఏర్పాటు కాకపోవడంతో తలోదారి అయ్యారన్నారు. ప్రజలు సమస్యలపై కార్యాలయానికి వెళితే స్పందించేవారు లేరని విమర్శించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మున్సిపాల్టీ పరిపాలనా విభాగంపై దృష్టి సారించి ప్రజల మౌలిక సదుపాయాలు, సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చనుబండలో 'పొలం పిలుస్తోంది'

చాట్రాయి: వరి సాగులో తెగుళ్ల నివారణపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి బి. శివశంకర్ అన్నారు. చనుబండ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువులను వాడకుండా సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. దోమ పోటు నివారణ చర్యలను వివరించారు.

ఎమ్మెల్యే వసంతను కలిసిన ఎంపీడీఓ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇబ్రహీంపట్నం ఎంపీడీఓ సునీతశర్మ మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను గొల్లపూడిలోని ఆయన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు మొక్కను అందచేశారు. ఈ సందర్భంగా సునీత శర్మకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించాలని ఆయన సూచించారు.

ఆశా వర్కర్ల ఆందోళన



నూజివీడు: రాజకీయ ఒత్తిడితో తొలగించిన టి. నర్సాపురం గండిగూడెం ఆశా వర్కర్ కె. లక్ష్మీమంగను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పీహెచ్‌సీ వద్ద ఆశా వర్కర్లు ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి జి. రాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ జోక్యం ఎక్కువైందని, దశాబ్దాల కాలానికి పైగా పనిచేస్తున్న ఆశావర్కర్లను తొలగించడం అనాగరిక చర్య అని ధ్వజమెత్తారు. అనంతరం వైద్యాధికారి కె. సౌమ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

● ఆగిరిపల్లి: ఆశా వర్కర్లపై పెరుగుతున్న రాజకీయ కక్ష సాధింపు చర్యలను వెంటనే ఆపాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ ఆగిరిపల్లి మండల కార్యదర్శి నీలాంబరం డిమాండ్ చేశారు. టి. నర్సాపురం మండలం గండిగూడెంలో ఆశా వర్కర్ లక్ష్మీమంగను విధుల నుంచి తొలగించడంతో ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆగిరిపల్లిలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి జగన్మోహన్‌రావుకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు, సునీత, సుధా, రమ్య పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం ఆదాయం రూ.4.24 లక్షలు

తిరువూరురూరల్: లక్ష్మీపురంలో పంచాయతీ చేపల చెరువుల వేలాన్ని గురువారం నిర్వహించారు. లక్ష్మీపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గుట్ట చెరువు, అంకమ్మ చెరువు, రావికుంట చెరువుల్లో చేపలు పట్టే హక్కు కోసం డివిజినల్ పంచాయతీ అధికారి ఈ వేలం నిర్వహించారు. గుట్ట చెరువుకు రూ.2.65 లక్షలు, అంకమ్మ చెరువుకు రూ.1.29 లక్షలు, రావికుంట చెరువుకు రూ.30,600 వేలం ద్వారా ఆదాయం వచ్చిందని పంచాయతీ కార్యదర్శి రవికాంత్ తెలిపారు. రెండేళ్ల కాల పరిమితికి ఈ వేలం నిర్వహించామన్నారు.